క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంపీపీగా ఎర్ర నాగప్పయాదవ్


బాధ్యతలు స్వీకరిస్తున్న ఎర్ర నాగప్ప యాదవ్

తుగ్గలి : మండల ఇన్‌చార్జ్ ఎంపీపీగా వైస్ ఎంపీపీ-2 ఎర్ర నాగప్పయాదవ్ నియమితులయ్యారు. ఇది వరకు ఎంపీపీగా ఉన్న అనుం రాజు ఆదెమ్మ (పగిడిరాయి) వ్యక్తిగత కారణాలతో ఈ ఏడాది మార్చిలో తన పదవికి రాజీనామా చేశారు. ఎంపీపీ ఎన్నిక నోటిఫికేషన్ వెలువడేంత వరకు జొన్నగిరి ఎంపీటీసీ సభ్యుడు వైస్ ఎంపీపీ-2గా ఉన్న ఎర్ర నాగప్పయాదవ్‌ను ఇన్‌చార్జ్‌గా ఎంపీపీగా కొనసాగించాలని జెడ్పీ సీఈఓ కార్యాలయం నుంచి ఉత్తర్వులు వచ్చాయని ఎంపీడీఓ విజయలక్ష్మి తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు.

డెంగీపై అవగాహన ర్యాలీ

పత్తికొండ రూరల్ : డెంగీ వ్యతిరేక మాసోత్సవంలో భాగంగా మండలంలోని చక్రాళ్ల గ్రామంలో శుక్రవారం పాఠశాల విద్యార్థులతో కలిసి వైద్యారోగ్యశాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ దోమలు వ్యాపించకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఎంపీడీఓ రామారావు పంచాయతీ సిబ్బందితో తాగునీటి ట్యాంకులు శుభ్రం చేయించారు. ఐదుగురు విద్యార్థులకు డ్రెస్సింగ్ కోట్‌లు అందజేశారు. సర్పంచు శ్రీరాములు, పంచాయతీ కార్యదర్శి పవన్‌కుమార్, హెల్త్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

మట్టి కుప్పలు తొలగించండి

పత్తికొండ రూరల్ : పట్టణంలోని పోలీసు స్టేషన్ పక్కన సీసీ రోడ్డుపై క్యూరింగ్ కోసం వేసిన మట్టిని తొలగించాలని మేజర్ గ్రామపంచాయతీ ఈఓ నరసింహులు తెలిపారు. కొన్ని రోజుల కిందట నూతనంగా సీసీ రోడ్డు వేశారు. రోడ్డు క్యూరింగ్ కోసం మట్టి వేశారు. అసౌకర్యంగా ఉన్న మట్టిని తొలగించాలని స్థానికులు ఈఓ దృష్టికి తీసుకెళ్లారు.

ఈఓపీఆర్డీపై విచారణ


విచారణ చేస్తున్న ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్

హొళగుంద: స్థానిక ఈఓపీఆర్డీ చంద్రమౌళీశ్వరగౌడ్‌పై వచ్చిన ఆరోపణలపై ఆదోని డీఎల్‌పీఓ నూర్జహాన్ శుక్రవారం విచారణ చేపట్టారు. ఎంపీడీఓ ఆజాద్ సమక్షంలో ఆయా గ్రామాలకు చెందిన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులను ఆమె విచారించారు.బిల్లుల మంజూరులో మామూళ్లు, కిందిస్థాయి అధికారుల పట్ల వేధింపులపై విచారణ చేపట్టినట్లు డీఎల్‌పీఓ తెలిపారు. నివేదికను జిల్లా పంచాయతీ అధికారికి అందజేస్తానని చెప్పారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

ఆలూరు రూరల్: ప్రభుత్వ పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 31వ తేదీన స్పాట్ అడ్మిషన్లకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఆలూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నపురెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. 2024-25కు సంబంధించి కళాశాలలో సివిల్, ఇంజినీరింగ్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు, పాలీ సెట్ ప్రవేశ పరీక్ష రాయని వారు స్పాట్ అడ్మిషన్‌కు హాజరుకావచ్చన్నారు. ఈ నెల 31వ తేది ఉదయం 9.30 గంటలకు జరిగే కార్యక్రమానికి హాజరయ్యే విద్యార్థులు పదవ తరగతి మార్కులిస్టు, టీసీ, 4 నుంచి 10వ తరగతి స్టడీ సర్టిఫికెట్, కుల ధృవీకరణ పత్రం, 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, ఆధార్ కార్డుతో పాటు మూడు సెట్ల జిరాక్స్ వెంట తెచ్చుకోవాలని సూచించారు. ఎంపికైన విద్యార్థులు రూ.6,500 అడ్మిషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. స్పాట్ అడ్మిషన్ పొందిన విద్యార్థులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి స్కాలర్‌షిప్ వర్తించదని వెల్లడించారు.

గాయత్రీమాతకు ప్రత్యేక పూజలు

ఆస్పరి: మండల కేంద్రం సమీపంలోని రామతీర్థంలో వెలసిన గాయత్రీ మాత ఆలయంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు రూపామోహన్ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి కుంకుమార్చన, హోమం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు జరిపించారు.

హామీలు గాలికొదిలి.. అరాచకానికే ప్రాధాన్యం


కర్నూలు ఆసుపత్రిలో రెహమాన్‌ను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

వెల్దుర్తి(కృష్ణగిరి): ఇచ్చిన హామీలను, నమ్మిన ప్రజలను గాలికొదిలి ప్రతిపక్షంపై దాడులు, హత్యలు, అరాచకానికే కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని మాజీ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. టీడీపీ కార్యకర్తల చేతిలో గాయపడిన వెల్దుర్తి పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త రెహమాన్‌ను కర్నూలు ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం పరామర్శించారు. ఆమె మాట్లాడుతూ తాను ఉన్నానని రెహమాన్‌కు భరోసా ఇచ్చారు. మంచి వైద్యం అందించాలని వైద్యులను కోరారు.

చెరువులు ఖాళీ!

ఏటేటా చెరువుల్లో నీటి చేరిక తగ్గిపోతోంది. ఈ ఏడాది వర్షాకాలం ప్రారంభమై నెలన్నర గడిచింది. అయినా మండలంలో అరకొర వర్షాలే. భారీ వర్షాలు కురవకపోవడంతో చెరువుల్లో జలకళ కనిపించడం లేదు. అరొకర వర్షాలకు చెరువులు, కుంటల్లో నామ మాత్రంగానే నీరు చేరింది. చెరువులు ఒట్టిపోవడంతో వ్యవసాయ బోర్లలో నీటిధార తగ్గడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

- వర్షకాలం ప్రారంభమై నెలన్నర పూర్తి
- చెరువుల్లోకి వరద నీటి చేరిక అంతంత మాత్రమే
- నీటితో నిండకపోతే సాగు, తాగు నీటికి ఇక్కట్లు
- ఆందోళనలో రైతులు


ఒట్టిపోయిన జీ.ఎర్రగుడి చెరువులో కంప చెట్లు పెరిగిన దృశ్యం

తుగ్గలి : గత కొన్నేళ్ల నుంచి వర్షాలు తగ్గుతూ వస్తున్నాయి. గత 20 ఏళ్లలో ఏ మూడు, నాలుగు సార్లు మాత్రమే చెరువులు పూర్తిస్థాయిలో నిండాయి. మండలంలో బొందిమడుగుల, ముక్కెల్ల, రాంపల్లి, చెన్నంపల్లి, పగిడిరాయి, జొన్నగిరి, జీ.ఎర్రగుడి, ఎద్దులొడ్డి, రాతన, తుగ్గలిలో చెరువులు ఉండగా, పెండేకల్లు బుగ్గానికుంట, మామిళ్లకుంట, బాపనకుంటలో కుంటలు ఉన్నాయి. ఏటా అడపాదడపా వర్షాలు కురుస్తున్నాయే తప్ప భారీ వర్షాలు కురవడం లేదు. దీంతో ఆయా చెరువులు, కుంటల కింద ఉన్న దాదాపు వెయ్యి ఎకరాలకు పైగా బీడు వారాయి. గతంలో భారీ వర్షాలకు రైతులు వరి పంట సాగుచేసేవారు. తిండి గింజలతో పాటు, పశువులకు వరిగడ్డి దొరికేది. వర్షాలు తగ్గి పోతుండడంతో చెరువులు, కుంటలు వెలవెలబోతున్నాయి. ఆయకట్టు సాగు క్రమేణా కనుమరుగవుతోంది. ఇక గ్రాసం కరువై పశువులు తగ్గిపోయాయి.

చెరువులు నిండితేనే...

ఈ ఏడాది ఇప్పటి వరకు మండలంలో భారీ వర్షాలు పడలేదు. అరకొర వర్షాలతో చెరువులకు 30 శాతం నీరు చేరింది. జూన్‌లో సాధారణ వర్షపాతం 94 మి.మీ కాగా 161 మి.మీ. వర్షపాతం నమోదైంది. జూలైలో 97 మి.మీ గాను ఇప్పటి వరకు 50.2 మి.మీ వర్షపాతం నమోదైంది. చెరువులు నిండితేనే ఆయకట్టు సాగు అవుతుంది. బోర్లలో భూగర్భ జలాలు పెరిగి పంటల సాగుకు ఇబ్బందులుండవు. ముఖ్యంగా తాగునీటి సమస్య తీరుతుంది. ఏటా సరైన వర్షాలు లేక చెరువులు ఒట్టిపోతుండడంతో వేసవిలో చాలా గ్రామాల్లో నీటి సమస్య తీవ్రమవుతోంది. ప్రకృతి సహకరించకపోవడం, తీవ్ర వర్షాభావం కారణంగా ఏటా మండల రైతాంగం నష్టపోతూనే ఉన్నారు. చెరువులకు పైపులైన్ ద్వారా హంద్రీ నీవా నీటి మళ్లించే కార్యక్రమాన్ని గత ప్రభుత్వం చేపట్టింది. గతేడాది ట్రయల్ రన్ కింద బొందిమడుగుల చెరువుకు నీటిని వదిలారు. చెరువులన్నింటినీ హంద్రీ నీవా నీటితో నింపితే మండలంలోని రైతులు గట్టెక్కుతారు. అలాగే మంచినీటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది.


జొన్నగిరి చెరువులోకి చేరిన కొద్దిపాటి వర్షపు నీరు


అడుగంటిన పగిడిరాయి చెరువు

బోర్లలో నీళ్లు తగ్గాయి



ఏటా వర్షాలు తగ్గిపోతుండడంతో బోర్లలో జలాలు తగ్గిపోతున్నాయి. 10 ఎకరాలలో మిరప, వేరుశనగ పంట సాగు చేశా. చెరువులో నీళ్లు ఉంటే బోర్లలో నీళ్లు బాగా వస్తాయి. తాగునీటి సమస్య కూడా ఉండదు. చెరువు ఎండిపోయి ఈ వేసవిలో తీవ్రమైన తాగునీటి సమస్య ఏర్పడింది. తాగునీటి కోసం జనం ఏటా ఇబ్బంది పడుతున్నారు. చెరువులకు హంద్రీనీవా నీళ్లు మళ్లించి జనం కష్టాలు తీర్చాలి.

– పక్కీరప్ప, రైతు, జొన్నగిరి

చెరువులకు నీళ్లు మళ్లించాలి



సరైన వర్షాలు లేక చెరువులు ఒక ఏడు నిండితే ఐదేళ్లు నిండవు. కొన్నేళ్ల క్రితం చెరువుల కింద వరి పంట పండించే వారు. చెరువులు నిండక ఇప్పుడు వరి పంట సాగు చేయడం లేదు. హంద్రీ నీవా ద్వారా చెరువులకు పైపులైన్ ద్వారా నీళ్లు మళ్లించే కార్యక్రమం గత ప్రభుత్వం చేపట్టింది. అసంపూర్తి పనులను త్వరితగతిన పూర్తిచేసి చెరువులను నీటితో నింపి రైతులను ఆదుకోవాలి.

– జనార్ధన, మాజీ సర్పంచ్, పగిడిరాయి

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

మద్దికెర : అధికారులు విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని మండల స్పెషల్ అధికారి, ఏపీ మైక్రో ఇరిగేషన్ పీడీ ఉమాదేవి హెచ్చరించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు తీరుపై మండల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నీటి కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ అలివేలమ్మ, ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు


బాపురం వద్ద ఎల్లెల్సీ మరమ్మతు పనులపై కాలువ అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామలక్ష్మి

హాలహర్వి: ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పని ఆర్డీఓ రామలక్ష్మి హెచ్చరించారు. శుక్రవారం ఆమె మండలంలో విస్తృతంగా పర్యటించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రి, మండల రెవెన్యూ కార్యాలయం, కస్తూర్బా విద్యాలయాన్ని పరిశీలించారు. ఆసుపత్రిలో వైద్య సేవలపై రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కేజీబీవీలో పరిసరాలను పరిశీలించి, విద్యార్థుల భోజనశాలను తనిఖీ చేసి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ ఇంద్రారాణితో సమస్యలపై ఆరా తీశారు. తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. కౌలు గుర్తింపు కార్డుల లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. అనంతరం బాపురం వద్ద ఎల్లెల్సీ కాలువకు పడిన రంధ్రాన్ని పరిశీలించి, మరమ్మతు పనులపై ఆరా తీశారు. తహసీల్దార్ బ్యూలా, వైద్యాధికారులు తిమ్మన్న, మన్సూర్‌వలి, సర్వేయర్‌లు, వీఆర్వోలు ఉన్నారు.

వెల్దుర్తి ఇన్‌చార్జ్ ఎంపీపీగా మిద్దె రంగయ్య


బాధ్యతలు స్వీకరించిన మిద్దె రంగయ్యను అభినందించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): ఈ ఏడాది మార్చిలో వెల్దుర్తి ఎంపీపీ బొమ్మన సరళారెడ్డి రాజీనామా చేయడంతో ఇన్‌చార్జ్ ఎంపీపీగా వైస్ ఎంపీపీ -1, గోవర్ధనగిరి ఎంపీటీసీ (వైఎస్సార్‌సీపీ) మిద్దె రంగయ్య నియమించబడ్డారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి శుక్రవారం ఆదేశాలు రావడంతో ఎంపీడీఓ శివశంకరప్ప ఇన్‌చార్జ్ బాధ్యతలు చేపట్టాలని మిద్దె రంగయ్యను ఆహ్వానించారు. దీంతో మిద్దె రంగయ్య వైఎస్సార్‌పీ మండల అధ్యక్షుడు, ఎంపీటీసీ బొమ్మన రవిరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు దాదిపోగు సుంకన్న మాదిగ, వెల్దుర్తి ఎంపీటీసీ చిట్టెమ్మ, వెల్దుర్తి సర్పంచ్ ముత్యాల శైలజ, పట్టణ కన్వీనర్ వెంకట్‌నాయుడు ఇతర నాయకులతో కలిసి శుక్రవారం మధ్యాహ్నం ఎంపీపీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆవుల వెంకటేశ్వర్లు, పెద్దన్న, దేవరాజు, గోవర్ధనగిరి జయరాముడు, రంగన్న, శేఖర్, కేశవ్, శ్రీరంగాపురం బాలకృష్ణ, కృష్ణాపురం ఎల్లకృష్ణ పాల్గొన్నారు.

ఘనంగా విజయ్ దివస్


ఆలూరు వంద అడుగుల జాతీయ జెండాతో విద్యార్థుల ర్యాలీ

పత్తికొండ రూరల్ : కార్గిల్ పోరులో విజయం సాధించి 25 సంవత్సరాలు గడచిన సందర్భంగా పత్తికొండలో శుక్రవారం సైనిక సేవలను స్మరించుకుంటూ బీజేపీ ఆధ్వర్యంలో విజయ్ దివస్ ర్యాలీ నిర్వహించారు. అసెంబ్లీ కో-కన్వీనర్ గోవర్ధన్,మండల అధ్యక్షుడు శంకరయ్య, జిల్లా కార్యదర్శి బ్రహ్మయ్య, సీనియర్ నాయకులు పూనా మల్లికార్జున, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు దండిమల్లికార్జున, బీజేవైఎం జిల్లా కార్యదర్శి కరణం నరేష్ పాల్గొన్నారు.

ఆలూరు: కార్గిల్ పోరులో దేశానికి విజయాన్ని అందించిన సైనికులను స్మరించుకుంటూ శుక్రవారం పట్టణంలో విజయ్ దివస్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక పాఠశాలల విద్యార్థులు, మాజీ సైనిక ఉద్యోగులు, ఉపాధ్యాయులు వంద అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. మాజీ సైనిక ఉద్యోగుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌బి, శివప్రసాద్,గోపాల్, మహేష్, ఖాజాహుసేన్, రంగస్వామి, రామాంజనేయులు పాల్గొన్నారు.

జింకల నుంచి రక్షించండి

దేవనకొండ: మండలంలోని కుంకనూరు, పొట్లపాడు, బెల్లందొడ్డి, అలారుదిన్నె, కొత్తపేట, పులాల్పురం, దేవనకొండ, తెర్నెకల్ తదితర గ్రామాల్లో పంట పొలాలపై దాడి చేస్తున్న జింకలబారి నుంచి రైతాంగాన్ని కాపాడాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లాధ్యక్షులు బి.వీరశేఖర్, రైతు సంఘం మండల కార్యదర్శి సూరి కోరారు. ఈ మేరకు శుక్రవారం తహసీల్దార్ ఈశ్వరయ్యశెట్టికి వినతి పత్రం అందజేశారు.

సేవలను వినియోగించుకోండి

హొళగుంద: విద్యార్థులకు ఆధార్ అప్‌డేట్, ఇతర పనుల కోసం హొళగుందలో ఆధార్ సెంటర్ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. శుక్రవారం ఆధార్ కేంద్రాన్ని పరిశీలించారు. మండలంలో హెబ్బటం, చిన్నహ్యాట, హొళగుంద సచివాలయం -3కి సంబంధించి మూడు ఆధార్‌కేంద్రాలు మంజూరు కాగా హొళగుంద-3 కేంద్రం కొన్ని కారణలతో కొనసాగడం లేదన్నారు.

మహిళలు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలి

ఆలూరు: మహిళలు ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని పండితులు, పంచాగం పఠన కర్త, గురురాజ రవిశాస్త్రి పేర్కొన్నారు.శుక్రవారం సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్థానిక వాసవీ ఆలయం నుంచి ఊరేగింపుగా కోటవీదిలో కొలువుదీరిన సుంకులాంబ దేవి ఆలయం వరకు ఊరే గింపుగా తరలివెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

పెరవలిలో శిక్ష సప్తాహ్

మద్దికెర : శిక్ష సప్తాహ్‌లో భాగంగా పెరవలి ఉన్నత పాఠశాలలో 10 వతరగతి విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్, ఒకేషనల్ సబ్జెక్టుపై అవగాహన కల్పించామని ఉపాధ్యాయుడు మహబూబ్ శుక్రవారం తెలిపారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని రక్షిద్దాం


ఆలూరులో మొక్క నాటుతున్న ఏజీఎం సునీల్

ఆలూరు రూరల్: పర్యావరణాన్ని రక్షించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని కర్నూలు జిల్లా సహకార బ్యాంక్ ఏజీఎం సునీల్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని కేడీసీసీ బ్యాంక్ ఆవరణలో ఇన్‌చార్జ్ డీఎల్‌పీఓ ప్రకాష్ నాయుడుతో కలిసి మొక్కలు నాటారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఇంటి ఆవరణ, పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో మొక్కలు నాటాలని కోరారు. బ్యాంక్ మేనేజర్ రవి, సిబ్బంది ఉన్నారు.

సంస్కృతిని పరిరక్షించాలి


మాట్లాడుతున్న మల్లు వెంకటరెడ్డి

దేవనకొండ: తరతరాల నుంచి వస్తున్న సంస్కృతిని రక్షించుకుందామని తిరుమల తిరుపతి దేవస్థానం హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లాశాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. మండలంలోని గుండ్లకొండ గ్రామంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా శుక్రవారం గోపూజ, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మూడు రోజులపాటు శ్రీనివాస రామానుజదాసు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై చేసిన ధార్మిక ప్రవచనాలు, స్థానిక భజన మండలితో భజన కార్యక్రమాలు నిర్వహించామన్నారు. మాజీ సర్పంచ్ ఈడిగ సుంకన్న, అనుముల ప్రకాష్‌గుప్త, కురువ మునిస్వామి, జి.గిడ్డన్న, కె.వెంకటరాముడు, రవిచంద్రారెడ్డి పాల్గొన్నారు.

దుకాణాల వేలానికి రాజకీయ గ్రహణం

- రాజకీయ ఒత్తిళ్లతో నిలిచిన కాంప్లెక్స్ వేలాలు
- ముచ్చటగా మూడోసారి వాయిదా


ఆలూరులో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్

ఆలూరు రూరల్: మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలోని దుకాణాల వేలానికి రాజకీయ గ్రహణం వీడడం లేదు. నాలుగేళ్లలో ముచ్చటగా మూడోసారి వేలాలు వాయిదా పడ్డాయి. శనివారం 27 దుకాణాలకు బహిరంగ వేలం వేస్తామని నాలుగు రోజుల క్రితం పంచాయతీ అధికారులు ప్రకటించారు. అయితే శుక్రవారం ఉదయం వేలాలు వాయిదా వేస్తున్నట్లు అధికారులు ఉత్తర్వులు ఇచ్చారు. వేలాలు వాయిదాకు రాజకీయ ఒత్తిళ్లే కారణమని తెలుస్తోంది. అధికార పార్టీ నాయకులు తమ వర్గానికి షాపులు దక్కించుకునే ప్రయత్నం చేస్తున్నట్లు సమాచారం. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి వేలాలు వాయిదా వేయడం మంచిది కాదని వ్యాపారులు పేర్కొంటున్నారు. వేలాలు నిర్వహించపోవడంతో గ్రామ పంచాయతీ ప్రతి నెలా రూ.1.20 లక్షల మేర ఆదాయాన్ని కోల్పోతుంది. నేషనల్ రూర్బన్ మిషన్ కింద రూ.1.20 కోట్లతో 2019లో 27 దుకాణాల నిర్మాణాలు చేపట్టి 2020లో పూర్తి చేశారు. గడిచిన నాలుగేళ్లలో వేలం నిర్వహించకపోవడంతో గ్రామ పంచాయతీకి అద్దె రూపంలో వచ్చే రూ.70 లక్షలు గండి పడింది. ఈ నిధులు గ్రామాభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడేవి. పంచాయతీ దుకాణ సముదాయం పట్టణ నడిబొడ్డున ఉండటంతో మంచి డిమాండ్ ఉంది. వేలం వాయిదా విషయమై పంచాయతీ ఈఓకు వివరణ కోరగా అనివార్య కారణాలతో వాయిదా వేశామని వారం తర్వాత నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా



ఆలూరులోని దుకాణాలు బహిరంగ వేలం వేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తా. ఈ విషయమై డీపీఓ నాగరాజు నాయుడుతో ఫోన్‌లో మాట్లాడా. వారం తర్వాత వేలాల నిర్వహిస్తామన్నారు. దుకాణాలు వేలం జాప్యం చేయడం సరైంది కాదు. ఉన్నతాధికారులు అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వేలాలు నిర్వహించకపోవడం చిరు వ్యాపారుల జీవనోపాధిపై ప్రభావం చూపుతోంది. దుకాణాల వేలం పాటలు పారదర్శకంగా నిర్వహించి అర్హులకు దక్కేలా చూడాలి. – బుసినే విరూపాక్షి, ఎమ్మెల్యే, ఆలూరు

శాకాంబరిగా వాసవీమాత



ఆలూరు: స్థానిక కర్నూలు- బళ్లారి రోడ్డు సమీపంలో వెలసిన శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో శుక్రవారం అమ్మవారికి శాకాంబరిగా అలంకరించారు. ఆలూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్ష్య,కార్యదర్శులు జనార్ధన్ శెట్టి, భాస్కర్‌శెట్టి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు నరేంద్రశాస్త్రి ఉదయం అమ్మవారికి గంగపూజ, ఫల, పుష్ప అలంకరణతో పాటు పలురకాల ఆకుకూరలు, కూరగాయలు, పండ్లతో అలంకరించి విశేష పూజలు జరిపించారు. ఆర్యవైశ్య మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందించాలి

మద్దికెర : బాలింతలు, గర్భిణులకు ప్రభుత్వం అందించే పోషకాహారాన్ని అందించాలని ప్రత్యేక అధికారి ఉమాదేవి తెలిపారు. శుక్రవారం మండలంలోని బురుజుల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాలు, శుద్ధజల ప్లాంట్‌ను పరిశీలించారు. ఈఓ హరి ఉన్నారు.

స్వచ్ఛమైన నీరు అందజేస్తాం

మద్దికెర : గ్రామాల్లోని ప్రజలకు స్వచ్ఛమైన నీరందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని ఈఓఆర్డీ మద్దిలేటిస్వామి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మయాంక్ తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలోని బోర్లను పరిశీలించి వాటిలో క్లోరినేషన్ బిల్లలను వేయించారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు

సాక్షి ఎఫెక్ట్


నగరడోణలో పారిశుద్ధ్య పనులు చేస్తున్న దృశ్యం

చిప్పగిరి: మండంలోని పలు గ్రామాల్లో మురుగు నీరు రోడ్లపై పారుతూ, చెత్తచెదారంతో దుర్వాసన వస్తుండడంతో శుక్రవారం పారిశుద్ధ్య లోపం..ప్రజలకు శాపం శీర్షికన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఈఓపీఆర్డీ బాలన్న గ్రామల్లో శుక్రవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. గ్రామాల్లో చెత్త చెదారం తొలగించి డ్రైనేజీలను శుభ్రం చేయించారు. గ్రామాల్లో పారిశుద్ధ్య లోపం తలెత్తకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు.

మాకు న్యాయం చేయండి


ధర్నా చేస్తున్న రైతులు

హొళగుంద: తమ భూముల విషయంలో అక్రమాలకు పాల్పడ్డారని, న్యాయం చేయాలని సుళువాయి, హొళగుందకు చెందిన రైతులు శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. రికార్డులు, ఆన్‌లైన్ అడంగల్‌లో తమ భూములను ఇతరుల పేర్ల మీద ఎలా ఎక్కిస్తారని ఆర్‌ఐ దినోజ్‌పై మండిపడ్డారు. హొళగుంద గ్రామానికి చెందిన 424ఏ సర్వే నంబరుకు సంబంధించి కొంత భూమిని అక్రమంగా తన అన్న కుమారుడి పేరుపై ఆన్‌లైన్ అడంగల్‌లో ఎక్కించారని చంద్రశేఖర్ ఆర్‌ఐతో వాగ్వాదానికి దిగాడు. ముగమానుగుంది గ్రామానికి సంబంధించి 4 ఎకరాల భూమి తమకు వారసత్వంగా రావాలని, ఆ భూమిని ఇతరులు అక్రమించుకుని ఆన్‌లైన్ అడంగల్, రికార్డులో ఎక్కించారని సుళువాయికి చెందిన రైతులు పార్వతమ్మ, పెద్ద వీరేశ్, చిన్న వీరేష్, గంగాధర, రత్నమ్మ, మారెమ్మ, ఎమ్మార్పీఎస్ నాయకులు పంచగుండిగ వెంకటేష్, వీరేష్ ఆర్‌ఐతో గొడవకు దిగారు. అన్ని రికార్డులు ఉన్నందున అన్‌లైన్‌లో నమోదు చేశామని ఆర్‌ఐ చెప్పారు. విషయం తెలుసుకుని ఏఎస్‌ఐ శ్రీనివాసులు, కానిస్టేబుల్ వెంకటేష్ రైతులతో మాట్లాడి ఆందోళన విరమించేలా చేశారు.

ఐకమత్యంతో గ్రామాభివృద్ధి

కృష్ణగిరి: గ్రామస్తులంతా ఐకమత్యంగా ఉండి గ్రామాన్ని అభివృద్ధి చేసుకోవాలని కృష్ణగిరి ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్ సూచించారు. శుక్రవారం మండలంలోని బోయబొంతిరాళ్ల గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పారిశుద్ధ్య పనులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయ భవనానికి, నూతన పైప్‌లైన్ ఏర్పాటుకు నిధులు కేటాయించాలని సర్పంచ్ రవి ఎంపీడీఓకు వినతిపత్రం అందించారు.

పత్తికొండ పీఆర్ డీఈఈగా శేషయ్య

కర్నూలు(అర్బన్): జిల్లాలోని పత్తికొండ పంచాయతీరాజ్ సబ్ డివిజన్‌కు డీఈఈగా ఎం.శేషయ్యను నియమిస్తూ ఇంజినీర్ ఇన్ చీఫ్ బీ.బాలునాయక్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో పత్తికొండ డీఈఈగానే విధులు నిర్వర్తించిన శేషయ్య కొంత కాలం క్రితం పీఆర్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిపార్టుమెంట్‌కు బదిలీ అయ్యారు. తిరిగి ఆయన్ను పత్తికొండకు నియమిస్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

పత్తికొండ రూరల్ : వైద్య విభాగంలోని కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ సెక్రెటరీ క్రిష్ణయ్య కోరారు. శుక్రవారం స్థానిక ఆసుపత్రి ఆవరణలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం కార్మికుల నియోజకవర్గ నూతన కమిటీని ఎన్నుకున్నారు.

కొడి పీర్ల సరిగెత్తు

ఆలూరు రూరల్: మండల కేంద్రంలోని కోయనగర్ కాలనీలో కొలువైన కొడీ పీర్ల పెద్ద సరిగెత్తు శుక్రవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. సాయంత్రం 5 గంటల నుంచి భక్తులు చక్కెర తులాభారం చేసి, పూలు సమర్పించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తుగ్గలి : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని, సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ షర్మిల అన్నారు. ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా శుక్రవారం రామాపురంలో చేపట్టిన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు.ఆర్‌ఐ సుధాకర్‌రెడ్డి, వీఆర్వో అనంత్‌స్వరూప్ పాల్గొన్నారు.

ఆలూరు రూరల్: దోమల ప్రబలకుండా ఉండేందుకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యారోగ్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి అవగాహన కల్పించారు. శుక్రవారం ఆలూరులో ఫ్రైడే – డ్రైడే కార్యక్రమం నిర్వహించారు.

మద్దికెర : చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త బండ్లు వచ్చినపుడు వేయాలని సర్పంచ్ మల్లికార్జున, ఈఓ సుధాకర్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెరవలి గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు.

ఘనంగా కుంభోత్సవం

హొళగుంద: సమృద్ధిగా వర్షాలు కురవాలని మండల కేంద్రంలో వెలసిన దేవమ్మ, మారెమ్మ అమ్మవార్లకు శుక్రవారం కుంభోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక పెద్దబావి వద్ద గంగ పూజ చేసి అక్కడి నుంచి భక్తులు కుంభాలను ఆలయాలకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. గ్రామస్తులు పిండి వంటలను నివేదించారు.



సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

పత్తికొండ, ఆలూరు
97054 44304 (ఆలూరు, పత్తికొండ)
Office mail : sakshiknladvt@gmail.com